నిమ్స్ దవాఖానలో మందను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

మాజీఎంపీ మందకు పలువురి పరామర్శ

నిమ్స్ దవాఖానలో మందను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి

వనపర్తి టౌన్/అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 25 : నాగర్ కర్నూల్ మాజీఎంపీ మంద జగన్నాథం అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ రాములు, బీఆర్ఎస్‌నేత ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్, గద్వాల మాజీ జెడ్పీ చైర్మన్ సరిత తదితరులు బుధవారం దవాఖానకు వెళ్లి కుటుంబ సభ్యులు మంద వెంకట్ కుమార్, మంద శ్రీనాథ్‌ను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు తెలిపారు.

జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి,మాజీ ఎంపీ

హైదరాబాద్‌లో నాగం తిరుపతిరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ చంద్రశేఖర్‌రెడ్డి

వనపర్తి టౌన్, డిసెంబర్ 25 : బీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. నాగం తిరుపతిరెడ్డి దంపతులకు వారు పూలబొకేను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే మర్రికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నేరళపల్లిలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గోపాల్‌పేట, డిసెంబర్ 25 : నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి ఇటీవలే మృతి చెందాడు. మర్రి స్వగ్రామం తిమ్మాజిపేట మండలంలోని నేరళపల్లి గ్రామానికి బుధవారం బీఆర్ఎస్ జిల్లా నాయకులు ప్రేమ్ నాథ్‌రెడ్డి, మండల నాయకులు శ్రావణ్‌కుమార్, బిళ్లకంటి రాజు, వంశీ, ఓంకార్, కురుమయ్య తదితరులు వెళ్లి మర్రిని కలిసి పరామర్శించారు.

ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలియజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి
- సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు

గద్వాలటౌన్, డిసెంబర్ 25 : సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదే అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని స్మృతివనం వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16రోజులుగా ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రానున్నది పరీక్షల కాలం.. ఇలాంటి తరుణంలో ఉద్యోగులు నిరసన చేపట్టడంతో ఇటు ఉద్యోగులు, అటు విద్యార్థులు పూర్తిగా నష్టపోయే అవకాశం ఉన్నదన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, నాయకులు సుభాన్, విజయ్‌తోపాటు ఎస్ఎస్ఏ ఉద్యోగులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మహాపడి పూజకు

రావుల రూ. లక్ష ఆర్థిక సాయం

వనపర్తి టౌన్, డిసెంబర్ 25 : జిల్లాకేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఏటా వైభవంగా నిర్వహించే అయ్యప్ప స్వామి మండల మహాపడి పూజకు బుధవారం మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి రూ. లక్ష ఆర్థిక సహకారాన్ని చెక్కు రూపంలో అందజేసినట్లు బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ తెలిపారు. ప్రతి ఏటా పడి పూజకు ఆర్థిక సహకారం అందించడమే కాకుండా తాను ఎంపీగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించారని, అదే విధంగా ఆయన తల్లి వెంకట పద్మమ్మ పేరిట ఆలయ ముఖద్వారం నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నగేశ్, ఆలయ నిర్వాహకులు గట్టు, వెంకన్న, ఆలయ ప్రధాన అర్చకులు రమేశ్ శర్మ, స్వాములు రంగం శ్రీను, నంద, రమేశ్, వెంకటేశ్, శ్రీను, బాలు తదితరులు ఉన్నారు.

మహాపడి పూజకు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అందజేసిన రూ. లక్ష ఆర్థిక సహకారం చెక్కును ఆలయ కమిటీకి అందజేస్తున్న పార్టీ మీడియా కన్వీనవర్ నందిమల్ల అశోక్

డస్ట్‌తో అదనపు గదుల నిర్మాణం

- సెలవు దినం కూడా పనులు
- నిర్మాణ పనులపై అధికారుల పర్యవేక్షణ కరువు

అమరచింత, డిసెంబర్ 25: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.27లక్షల నిధులతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారు నాసిరకంగా పనులను చేపడుతూ ఇసుక, సిమెంట్‌కు తోడుగా డస్ట్‌ను మిక్సింగ్ చేసి పనులను చేపడుతున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు నాలుగు వందలకు పైగా విద్యార్థులు ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈడబ్ల్యూఐడీసీ పథకం ద్వారా రూ.27లక్షలతో చేపడుతున్న ఈ అదనపు గదలు నిర్మాణ పనులు పిల్లర్లు పూర్తి కాగా, బుధవారం క్రిస్మస్ పండుగ సెలవు దినంలో కూడా బెస్‌మెంట్ పనులను చేస్తున్నారు.

అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణానికి డస్ట్‌ను కలుపుతున్న కూలీలు

పనులు తొందరగా పూర్తి కావాలి కాదా ..

ఈవిషయంపై ఈడబ్ల్యూఐడీసీ అధికారి మహమూద్ ఆజామ్‌ను వివరణ కోరగా ఈ అదనపు గదుల నిర్మాణ పనులకు టెండర్లు ఉండవు.. కాబట్టి గుత్తేదారులు ఎవరూ ఉండరని, స్థానిక పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పనులు చేపడతారని తెలిపారు. బెస్‌మెంట్ నిర్మాణంలో ఇసుక, సిమెంట్‌కు తోడుగా తప్పకుండా డస్టు వాడుతారని, అధికారుల పర్యవేక్షణ కేవలం కాక్రీంట్ వర్క్ నడిచేటప్పుడు మాత్రమే ఉంటుందని, వచ్చే మార్చి 31వ తేదీ వరకు పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉండడంతో సెలవుదినాలు కూడా పనులు చేస్తున్నారని అసహనంగా వివరణ ఇచ్చారు.

సెలవుదినం కూడా కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులు

క్రీస్తు బోధనలు సన్మార్గంలో నడిపిస్తాయి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, డిసెంబర్ 25 : క్రీస్తు బోధనలు మనుషులందరినీ సన్మార్గంలోనే నడిపిస్తాయని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చిలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్‌చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీస్తు జీవితం మానవాళికి ఇచ్చిన మహోన్నతమైన సందేశామన్నారు. అనంతరం క్రైస్తవులకు ఎమ్మెల్యే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, రామకృష్ణనాయుడు, మురళి, గోవింద్, ధర్మనాయుడు, రామాంజనేయులు, నాగేందర్ యాదవ్, మన్యం, రాజు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

గట్టు, డిసెంబర్ 25 : క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాచర్ల, బలిగేరలలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని కేక్‌లు కట్ చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ చైర్మన్ క్యామ వెంకటేశ్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ మోహన్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

శాంతికాముకుడు యేసుక్రీస్తు..

శాంతి, సహనం, ప్రేమ ప్రవచనాలతో సర్వ మతాల సారాంశం ఒక్కటే అని చాటిచెప్పిన శాంతికాము కుడు యేసుక్రీస్తు అని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హన్మంతు అన్నారు. మండలంలోని బలిగేర, మాచర్లలతోపాటు పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులను ఉద్ధేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు హన్మంతును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నూర్‌పాషా, తిరుమలేశ్, తిమ్మప్పగౌడ్, బాసు గోపాల్, డేవిడ్, లోకేశ్, రాజు, సామేల్ పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బాసు హనుమంతు

గద్వాలలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

ఉండవల్లిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, ప్రజలు

అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలి

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 25 : అమిత్‌షాను వెంటనే బర్తరఫ్ చేయాలని చిన్నఆముదాలపాడు మాజీసర్పంచ్ నాగేష్ అన్నారు. బుధవారం ఉండవల్లిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ముందుగా వివేకానంద విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నాగరాజు, బాలచంద్రుడు, శ్రీరాములు, మద్దిలేటి, మధు పాల్గొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూరు, డిసెంబర్ 25 : క్రిస్మస్ పర్వదినాన్ని క్రైస్తవులు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిల్లో ఉదయం నుంచి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి దేవుడి వ్యాక్యాన్ని వినిపించారు. పట్టణంలోని మొదటి వార్డు ఖానాపూర్ చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మార్గం సర్వ మానవాళికి అనుసరణీయమన్నారు. క్రీస్తు చూపిన సేవ, దయ, ప్రేమ మార్గాల్లో ప్రతిఒక్కరూ నడవాలని తెలిపారు. పాస్టర్ రెవ సుమన్ క్రీస్తు జన్మవృత్తాంతాన్ని, ఆయన మానవాళికి చేసిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

ఆత్మకూరులో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అదేవిధంగా బీసీ కాలనీ ఎంబీ కర్మేలు చర్చిలో పాస్టర్ రెవ జెర్మియా నేతృత్వంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం సంఘ పెద్దలు, క్రైస్తవులు భక్తిగీతాలను ఆలపించారు. కౌన్సిలర్ చెన్నయ్య క్రైస్తవులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

జోగులాంబ ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు

సీఈవోకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూర్, డిసెంబర్ 25 : జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను బుధవారం తెలంగాణ డిప్యూటీ సీఈవో(ఎలెక్షన్) సత్యవాణి కుటుంబ సభ్యులు, ఏపీ కమ్యూనికేషన్ డీఐజీ లక్ష్మీ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. పలికారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వ్యవసాయ కూలీల భరోసాపై ఆంక్షలు ఎత్తివేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

అమరచింత, డిసెంబర్ 25: తెలంగాణ ప్రభుత్వం భూమిలేని పేదలకు ఏడాదికి పన్నెండు వేలు ఇస్తామన్న హామీ ఇచ్చిందని, ఆ హామీ మేరకు కూలీల భరోసాపై పెడుతున్న నిబంధలను తక్షణమే ఎత్తివేసి కూలీలందరికీ రూ.12వేలు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆజయ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. భూమిలేని పేదలకు రైతు భరోసా తరహాలో ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ఇప్పుడు లబ్ధిదారుల ఎంపికకు అనేక కోర్రిలను పెడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు ఉపాధిహామీ పథకంలో కొత్తగా ఎవరికి జాబ్‌కార్డులు ఇవ్వలేదని, ఇప్పుడు జాబ్‌కార్డు, రేషన్‌కార్డు అంటూ పెడుతున్న నిబంధలను ఎత్తివేసి వ్యవసాయ కూలీలకు అందరికీ పథకాన్ని అమలు చేయాలని డిమాండత చేశారు. వ్యవసాయ కార్మిక సంఘాలతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని, అలాగే గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రేపు గట్టుకు కేంద్రమంత్రి రాక

గట్టు, డిసెంబర్ 25 : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ 27వ తేదీ శుక్రవారం గట్టు మండలానికి రానున్నారు. అస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రాం(ఏబీపీ) కార్యక్రమానికి గట్టు మండలం ఎంపికైంది. ఇందులో భాగంగా గట్టును వివిధ అంశాల్లో అభివృద్ధి పరచనున్నారు. ఇందులో భాగంగా వివిధ అంశాల ప్రగతి గురించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. సంబంధిత శాఖల అధికారులు తమ తమ శాఖల ప్రగతి ని వివరించనున్నారు. కార్యక్రమానికి మంత్రితోపాటు కలెక్టర్, ఎస్పీలు కూడా రానున్నట్లు అధికారులు తెలిపారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువండి

అయిజ, డిసెంబర్ 25 : యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ తాహేర్ పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

అమరచింత, డిసెంబర్ 25 : దివంగత మాజీ ప్రధాని అటల్ బీహరి వాజ్‌పేయ్ జయంతి వేడులకు బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు పాతబస్టాండ్ ఆవరణలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి దేశానికి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, భాస్కర్, అనిల్, శ్రీనివాసులుయాదవ్, రాకేశ్ శెట్టి ఉన్నారు.

అలంపూర్ పట్టణంలో..

అలంపూర్, డిసెంబర్ 25 : మాజీప్రధాని వాజ్‌పేయ్ శతజయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్వర్, జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మణ్, రాము, మద్దిలేటి, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల

గద్వాల అర్బన్, డిసెంబర్ 25 : యువత క్రీడా పోటీల్లో ప్రతిభ చాటాలని డీవైఎస్‌వో ఆనంద్ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని జనవరి 10 నుంచి 16 వ తేదీ వరకు భగత్‌సింగ్–చేగువేరా ట్రోఫి ఉమ్మడి జిల్లా స్థాయి గ్రేస్‌బాల్ క్రికెట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో విడుదల చేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు మురళి, పాషా, శేఖర్, నర్సింహ, వంశీ ,పరుశ, వీరేశ్, అఖిల్ ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చీల్లో పత్యేక ప్రార్థనలు

వనపర్తి, డిసెంబర్ 25 : వనపర్తి పట్టణంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రజలు చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి పండుగను నిర్వహించారు. కల్వరి చర్చిలో పాస్టర్ జాన్‌రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పార్థనలు చేశారు. పండుగ సందర్భంగా ప్రభుత్వ దవాఖానలో పండ్లు పంపిణీ చేశారు. ప్రజలంతా ప్రశాంతంగా, సుఖసంతోషాలతో ఉండాలని యేసుక్రీస్తు త్యాగాలు చేశారని ఈ సందర్భంగా పాస్టర్ జాన్ రాజు చెప్పారు. యేసుక్రీస్తు అడుగుజాడల్లో నడవడంతో మంచి సమాజం ఏర్పడుతుందని జాన్ పేర్కొన్నారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి గంధం ప్రసాద్, యాకోబు, కేశవులు, జాన్ మార్క్, గంధం పరంజ్యోతి, రవికుమార్, దాసు, ప్రభాకర్, భాస్కర్, ప్రసాద్, అరుణ, రాజు, గొర్ల దాసు, రజిని, సువర్ణ, రేణుక, కమల ఇందిరా పాల్గొన్నారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, డిసెంబర్ 25 : మండలకేంద్రంతోపాటు తాటికుంట, పాల్వాయి, అమరవాయి, మద్దెలబండ, విఠలాపురం, కుర్తిరావుల చెర్వు తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను బుధవారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చీలను విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఆనంతరం పాస్టర్లు క్రీస్తు జనన, మరణ జీవిత చరిత్రలను చదివి వినిపించారు. చిన్నారులు, ఆట, పాటలతో ఆనందంగా వేడుకలను నిర్వహించుకున్నారు.

ధరూర్ మండలంలో..

ధరూరు, డిసెంబర్ 25 : క్రిస్మస్ వేడుకలను మండలంలో వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో చర్చిలో పాస్టర్ సుదర్శన్ అబ్రహం ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకటుకున్నాయి. కార్యక్రమంలో సంఘ పెద్దలు యోనా, పీటర్, దినకర్, రాజా రత్నం, వెంకటన్న, పాంటన్న, పౌలన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి చౌరస్తాలో వేడుకలను నిర్వహిస్తున్న క్రైస్తవులు

అమరచంత మండలంలో..

అమరచింత, డిసెంబర్ 25 : మండలకేంద్రంలోని ఎంబీ కార్మెల్ చర్చి, అలాగే గ్రామాల్లోని చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకులను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా వారు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేయగా, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితోపాటు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మండలకేంద్రంలోని ఎంబీ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొని యేసుప్రభు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరుతూ క్రైస్తవులకు పండుగ శుభకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంబీ చర్చి పెద్దలు వారిని పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు.

గోపాల్‌పేట మండలంలో..

గోపాల్‌పేట, డిసెంబర్ 25 : మండలంలోని క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నా. ఆయా గ్రామాల్లోని చర్చీల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చీల్లో పాస్టర్లు బైబిల్ సువార్తను చదివి వినిపించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ హర్యానాయక్, సింగిల్ విండో వైస్ చైర్మన్ రాములు, బీ ఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్‌రాజు, మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధ, ఉపాధ్యక్షురాలు స్వప్న రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్, మాజీ ఎంపీపీ సంధ్య, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ బీఆర్ఎస్ నాయకులు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఉండవెల్లి మండలంలో..

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 25 : క్రిస్మస్ పండుగను ఉండవెల్లి మండలంలోని పలుగ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చర్చీల్లో ప్రార్థనలు చేసి కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు.

వీపనగండ్లలో యేసు పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

అయిజ : ఎంబీ చర్చిలో ప్రార్థన చేయిస్తున్న పాస్టర్ రెవరెండ్ సీమోన్

వీపనగండ్ల మండలంలో..

వీపనగండ్ల, డిసెంబర్25 : మండల కేంద్రంలోని చర్చి దగ్గర బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించుకున్నారు. అంతకుముందు తెల్లవారుజామున వీధుల గుండా తిరుగుతూ యేసు పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించి ప్రార్థనలు నిర్వహించారు.

మదనాపురం మండలంలో..

మదనాపురం, డిసెంబర్ 25 : మండలకేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు బుధవారం జరుపుకున్నారు. మండలంలోని క్రైయిస్టు బాపిస్టు చర్చీలో అఖిలపక్షం నాయకులు క్రైసవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్, జేమ్స్ దేవదానం, మనోజ్ కుమార్, మహేశ్ కుమార్, జగదీశ్, రామకృష్ణ, బాలకృష్ణ, రాముడు పాల్గొన్నారు.

ఎర్రవల్లి మండలంలో..

ఎర్రవల్లిచౌరస్తా, డిసెంబర్ 25 : మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారురు. అదే విధంగా ఎర్రవల్లి చౌరస్తా లోని షాలేము మందిరము, సీసీయస్ బేతేలు ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

మదనాపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వనపర్తిలోని కల్వరి చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ప్రజలు

మల్దకల్‌లో చర్చి ఆరు బయట ప్రార్థన చేస్తున్న దృశ్యం


ధరూరు చర్చిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ఇటిక్యాల మండలంలో..

ఇటిక్యాల, డిసెంబర్ 25 : మండలంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ జరుపుకొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు చర్చీల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో చర్చీలను విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు.

అయిజ మండలంలో..

అయిజ, డిసెంబర్ 25 : పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంబీ చర్చిలో పాస్టర్ రెవరెండ్ సీమోన్, క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం పట్టణంలోని ఎస్సీకాలనీలో నిరుపేదలకు డబ్బాసైమన్ కుమారుడు భాస్కర్ దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేశ్, నాగేశ్, చంద్రశేఖర్, రాజు, జోషిరాజు పాల్గొన్నారు.